గునపాలు దించిన చేతులతో విగ్రహమా?

- అది తెలంగాణ తల్లికే అవమానం
- గాంధీ విగ్రహాన్ని గాడ్సే పెట్టినట్టే ఉంటది
- తెలంగాణకు అక్కరకురాని బొమ్మలను తొలగిస్తాం
- తెలంగాణ తల్లిని సమున్నతంగా ప్రతిష్ఠిస్తాం : మాజీ మంత్రి కేటీఆర్

హైదరాబాద్, ఆగస్టు 28 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ఉద్యమం గుండెల్లో గునపాలు దించిన చేతులతో తెలంగాణ తల్లి విగ్రహం పెట్టడం అంటే అది తెలంగాణ తల్లికి అవమానమేనని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టంచేశారు. గాంధీ విగ్రహం గాడ్సే పెడితే ఎట్లుంటదో సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ తల్లి విగ్రహం పెడితే కూడా అట్లుంటుందని ఎద్దేవాచేశారు. తెలంగాణకు అక్కరకురాని వాళ్ల బొమ్మలను తొలగిస్తామని, తెలంగాణ తల్లిని సమున్నతంగా ప్రతిష్ఠిస్తామని బుధవారం ఎక్స్‌వేదికగా కేటీఆర్ తేల్చిచెప్పారు. 'సోనియాగాంధీని దయ్యం, పిశాచి, బలిదేవత అన్న నువ్వా రాజీవ్‌గాంధీ మీద ప్రేమ ఒలకబోసేది' అని ఆయన రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి ప్రశ్నించారు. దొడ్డి దారిన టీపీసీసీ ప్రెసిడెంట్ అయ్యి ఇవాళ రాజీవ్‌గాంధీ మీద రేవంత్‌రెడ్డి ఒలకబోస్తున్న కపట ప్రేమ అందరికీ తెలుసునని పేర్కొన్నారు. సీఎం ఆలోచనల్లో కుసంస్కారం.. మాటలు అష్టవికారం అని ఎద్దేవా చేశారు. తెలంగాణ తల్లి కోసం నిర్ణయించిన స్థలంలో కాంగ్రెస్ నాయకుల విగ్రహాలేమిటని అడిగితే కారుకూతలు కూస్తావా? అని మండిపడ్డారు.

డిసెంబర్ 9న తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ

మొదటిపేజీ తరువాయి...

చేస్తున్నామని చెప్పారు. ప్రజల అభిమతానికి తగినట్టు తెలంగాణ తల్లి విగ్రహం రూపొందించే బాధ్యతను జేఎన్టీయూ ఫైన్ ఆర్ట్స్ విభాగం కళాశాల ప్రిన్సిపాల్‌కు అప్పగించామని వెల్లడించారు. నెక్లెస్‌రోడ్, ట్యాంక్‌బండ్ చుట్టుపక్కల దేశం, రాష్ట్రం కోసం ఎంతో చేసిన అంబేద్కర్, ఇందిరా గాంధీ, పీవీ నరసింహారావు, అంజయ్య, కాకా వెంకటస్వామి విగ్రహాలు, జైపాల్‌రెడ్డి సమాధి ఉన్నాయని, వీటిమధ్య రాజీవ్‌గాంధీ విగ్రహం లేకపోవడం లోటుగా కనిపించిందని అన్నారు. అందుకే సచివాలయం ఎదుట మేధావుల సూచన మేరకు రాజీవ్‌గాంధీ విగ్రహం ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ 'హైడ్రా'కు మద్దతుగా బీజేపీ ఫ్లెక్సీ

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన హైడ్రా సంస్థకు సంపూర్ణ మద్దతు తెలుపుతూ, సీఎం రేవంత్‌రెడ్డిని అపరభగీరథుడిగా కీర్తిస్తూ సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో బుధవారం బీజేపీ నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు చర్చనీయాంశంగా మారింది. బీజేపీ, కాంగ్రెస్ నాయకులు ఒకరినొకరు పొగుడుతూ ఫ్లెక్సీలు పెట్టుకోవడమేంటనే చర్చలు మొదలయ్యాయి. ఒకే ఫ్లెక్సీలో కాంగ్రెస్ సీఎం రేవంత్, బీజేపీ నాయకుల ఫొటోలు చూసి రాజకీయాల్లో ఇదేం బంధమోనని పలువురు ముక్కున వేలేసుకుంటున్నారు. – హుస్నాబాద్

రుజువు ఇదిగో.. కూల్చేదెప్పుడో!

- దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్ భూముల్లో సీఎం సోదరుడు తిరుపతిరెడ్డి సొంతిల్లు?
- ఆక్రమణలను ఎప్పుడు కూల్చేస్తారు?
- రేవంత్ రెడ్డికి నెటిజన్ల సూటి ప్రశ్న
- అక్రమ నిర్మాణంపై సోషల్ మీడియాలో చర్చ

దుర్గంచెరువు బఫర్ జోన్‌లో సీఎం రేవంత్ సోదరుడు తిరుపతిరెడ్డి ఇల్లు

హైదరాబాద్ సిటీబ్యూరో, ఆగస్టు 28 (నమస్తే తెలంగాణ): చెరువుల ఆక్రమణలపై కన్నెర్ర చేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి, హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు నెటిజన్లు సూటిప్రశ్నలు సంధిస్తున్నారు. తాజాగా సీఎం రేవంత్ రెడ్డి మీడియాతో చిట్‌చాట్‌లో 'చెరువులు, కుంటలను ఆక్రమించి నా కుటుంబసభ్యుల నిర్మాణాలు ఉన్నా నిలబడి కూల్చివేస్తా' అని స్పష్టం చేశారు. దీంతో సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డి దుర్గం చెరువును ఆక్రమించుకొని నిర్మించిన ఇంటి వివరాలను నెటిజన్లు వెలుగులోకి తెచ్చారు. 2000 సంవత్సరంలో భారీ వరదలు వస్తే.. ఈ చెరువు వరద నీరు ప్రవహించి ఏకంగా 9 కాలనీలు నీట మునిగాయి. దీంతో అప్పట్లోనే దుర్గం చెరువు ఫుల్ ట్యాంక్ లెవల్‌ను నిర్ధారిస్తూ హద్దు రాళ్లను ఏర్పాటు చేశారు. కానీ చెరువు బఫర్‌జోన్, ఎఫ్టీఎల్ పరిధిలో అక్రమ నిర్మాణాలు చేపట్టారు. ఇందులోనే సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డి ప్లాట్ నంబర్ 54, 55లో భారీ భవంతిని నిర్మించుకోవటమే ఇప్పుడు ప్రధాన చర్చకు కారణమైంది. మరి ఈ ఇంటినీ కూల్చివేస్తారా? అని నెటిజన్లు సూటిగా ప్రశ్నిస్తున్నారు. ఇలాంటి సంపన్నుల కబ్జా భవంతులను తొలి ప్రాధాన్యంగా కూల్చాలని డిమాండ్ చేస్తున్నారు. చెరువుకు సంబంధించిన పూర్తి ఆధారాలతో సోషల్‌మీడియా వేదికగా పంచుకోగా.. సీఎం, హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఏ విధంగా స్పందిస్తారో చూడాలి.

టీడీపీ, కాంగ్రెస్ పాలనలో చెరువుల అన్యాక్రాంతం

బీఆర్‌ఎస్ ప్రభుత్వం తొలి కేబుల్ బ్రిడ్జిని దుర్గం చెరువుపై నిర్మించగా, కాంగ్రెస్, టీడీపీ పాలనలోనే చెరువులు అన్యాక్రాంతం అయ్యాయని నెటిజన్లు చెప్తున్నారు. అందుకు తిరుపతిరెడ్డి ఇల్లే నిదర్శనం అని పేర్కొంటున్నారు. దుర్గం చెరువు దాదాపు 85 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించి ఉండగా.. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలోని ప్రాంతాలను పూడ్చివేసి కాలనీలు, రెసిడెన్షియల్ ప్రాజెక్టులను నిర్మించటం ఇప్పుడు వెలుగులోకి వచ్చింది. అమర్‌కో ఆపరేటివ్ హౌజింగ్ సొసైటీ, కావూరి హిల్స్, కల్యాణ్‌నగర్, బృందావన్ కాలనీ, హెక్టార్ గార్డెన్ వంటి కాలనీలన్నీ 2000లో వరదలోనే మునిగాయని ఇరిగేషన్‌శాఖ గుర్తించింది. ఈ క్రమంలో చెరువు భూముల్లో నిర్మించిన భవనాలను వ్యతిరేకిస్తూ కొందరూ కోర్టును ఆశ్రయించగా.. ఎఫ్‌టీఎల్ పరిధిలో అనుమతుల్లేని భవనాలను ఇరిగేషన్, రెవెన్యూ, హుడా అధికారులు తొలగించారు. ఆ తర్వాత కోర్టు ఆదేశాలతో ఆక్రమణలపై చర్యలు నిలిచిపోయాయి. కానీ ఇరిగేషన్, హెచ్‌ఎండీఏ, రెవెన్యూశాఖ అధికారులు ఇచ్చిన ఆధారాలతో ఈ భూములు రెసిడెన్షియల్ కార్యాకలాపాలకు అనుకూలం కాదని, రిక్రియేషనల్ జోన్‌గా మార్చాలని అప్పట్లోనే హైకోర్టు ఆదేశించింది.

సామాన్యుడిపైనే హైడ్రా ప్రతాపం

చెరువులు, కుంటలను ఆక్రమించి చేపట్టిన నిర్మాణాల విషయంలో దూకుడుగా వ్యవహరిస్తున్న హైడ్రా.. సామాన్యుడు నిర్మించుకున్న ఇండ్లపైనే ప్రతాపం చూపుతున్నదన్న విమర్శలు ఎదుర్కొంటున్నది. సామాన్యుడు నిర్మించుకునే, బిల్డర్లు, డెవలపర్లు చేసే తప్పిదాలతో కలల సౌధాలు కండ్ల ముందే పేకమేడల్లా కూలిపోతుంటే గుండెలు బాదుకొని కన్నీరు మున్నీరు అవుతున్నారు. రాజకీయ పలుకుబడితో చెరువులు, జలవనరులను చెరబట్టిన సంపన్న వర్గాల నిర్మాణాలను కూడా కూల్చివేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

వానకాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	37.5°c	22.5°c
మెదక్	33.2°c	21.5°c
నిజామాబాద్	32.3°c	24.0°c
రంగారెడ్డి	32.1°c	23.2°c
కరీంనగర్	32.0°c	25.0°c
ఖమ్మం	32.0°c	24.0°c
మహబూబ్‌నగర్	31.0°c	22.2°c
నల్లగొండ	30.0°c	24.4°c
హైదరాబాద్	30.0°c	23.3°c
వరంగల్	29.0°c	25.0°c

రేపటి నుంచి భారీ వర్షాలు!

హైదరాబాద్, ఆగస్టు 28 (నమస్తే తెలంగాణ): బంగాళాఖాతంలో గురువారం అల్పపీడనం ఏర్పడే అవకాశమున్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది.దీని ప్రభావంతో రాష్ట్రంలో ఈ నెల 30 నుంచి 2వ తేదీ వరకు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురువచ్చని అంచనా వేసింది. పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం,ఆసిఫాబాద్, మంచిర్యాల, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ,సిద్దిపేట జిల్లాల్లో వర్షా లు పడొచ్చని పేర్కొన్నది. ఆయా జిల్లాలకు ఎల్లో, ఆరెంజ్ అలర్ట్‌ను జారీ చేసింది.

'అగ్రిఫుడ్'లో మహిళల భాగస్వామ్యం

హైదరాబాద్, ఆగస్టు 28(నమస్తే తెలంగాణ): మెలిండా గేట్స్ ఫౌండేషన్ సహకారంతో రాష్ట్రంలో అగ్రిఫుడ్ వ్యవస్థల్లో మహిళలు, చిన్న తరహా పరిశ్రమల భాగస్వామ్యాన్ని పెంచేందుకు ఉన్న అవకాశాలపై ఐక్యరాజ్యసమితి అధ్యయనం చేపట్టనున్నది. ఐక్యరాజ్య సమితి అండర్ సెక్రటరీ జనరల్ ఆర్మిడా సల్సియాహ్ బుధవారం ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబుతో భేటీ అయ్యారు. భేటీలో టీజీఐఐసీ సీఈవో మధుసూదన్, ఫుడ్ ప్రాసెసింగ్ విభాగం డైరెక్టర్ అఖిల్, లైఫ్ సైన్సెస్ ఫౌండేషన్ సీఈవో శక్తి నాగప్ప తదితరులు పాల్గొన్నారు.

బదిలీలు, పదోన్నతుల్లో తప్పులు సవరించండి

హైదరాబాద్, ఆగస్టు28 (నమస్తే తెలంగాణ): గురుకుల సొసైటీ బదిలీలు, పదోన్నతులలో జరిగిన తప్పులను సవరించాలని ఆల్ తెలంగాణ గవర్నమెంట్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. డిస్‌లొకేట్, 317 జీవో బాధిత ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరింది. ఈ మేరకు సీఎంవో, మంత్రులకు, సాంఘిక సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి అసోసియేషన్ అధ్యక్షుడు కూకుట్ల యాదయ్య, జనరల్ సెక్రటరీ పాపిరెడ్డి, ట్రెజరర్ బసవయ్య బుధవారం వినతిపత్రం అందజేశారు. ఉన్నతాధికారులకు సమస్యలు విన్నవించారు. మొత్తంగా బదిలీలు, పదోన్నతులపై సమగ్ర విచారణ జరపాలని, నష్టపోయిన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

నా కుటుంబసభ్యుల నిర్మాణాలున్నా కూల్చేస్తా

- పార్టీలతో సంబంధం లేకుండా హైడ్రా కూల్చివేతలు
- ఓల్డ్ సిటీ కాదు.. ఏ సిటీకైనా వచ్చి కూలగొడతారు
- మీడియాతోచిట్‌చాట్‌లో సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 28 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో రుణమాఫీ జరగలేదని ధర్నాలు చేసేది బీఆర్‌ఎస్ కార్యకర్తలేనని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. బుధవారం సచివాలయంలో ఆయన మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తాము 27 రోజుల్లో రూ.18 వేల కోట్లు రుణమాఫీ చేశామని చెప్పారు. టెక్నికల్ అంశాలతో రుణమాఫీ జరగనివారు కలెక్టర్‌కు వివరాలు ఇవ్వాలని సూచించారు. రుణమాఫీ కానీ వారి వివరాలను మాజీమంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు కూడా ఇవ్వొచ్చని తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వం రూ.13,329 కోట్లు రుణమాఫీ చేసిందని వివరించారు. ప్రభుత్వం చేస్తున్న పనులకు, పార్టీలో చేరికలకు సంబంధం లేదని స్పష్టంచేశారు. తమకు పూర్తి మెజార్టీ ఉన్నదని, ఎవరినో భయపెట్టి చేర్చుకోవాల్సిన అవసరం లేదని అన్నారు. ప్రభుత్వ విధానాలు నచ్చి వస్తే చేర్చుకుంటామని పేర్కొన్నారు.

ఓల్డ్ సిటీ కాదు.. ఏ సిటీకైనా వస్తాం

ప్రజల ప్రయోజనం కోసమే హైడ్రాను ఏర్పాటు చేశామని రేవంత్ అన్నారు. చెరువుల్లో నిర్మాణాలు ఉంటే ఎంతటి వారైనా వదిలేది లేదని స్పష్టంచేశారు. పార్టీలతో సంబంధం లేకుండా హైడ్రా తన పని తాను చేసుకుంటూ పోతుందని తేల్చిచెప్పారు. ఓల్డ్ సిటీ కాదు.. ఏ సిటీ అయినా వెనక్కి తగ్గేదే లేదని తెలిపారు. యుద్ధ ప్రాతిపాదికన కూల్చివేతలు పూర్తిచేస్తామని, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో తన కుటుంబసభ్యుల భవనాలు ఉంటే వివరాలు ఇవ్వాలని, దగ్గరుండి వాటిని కూల్చివేయిస్తానని చెప్పారు. రాజకీయ నాయకులు, సినీహీరోలు ప్రజలకు రోల్‌మాడల్‌గా ఉండాలని సూచించారు. చెరువుల కబ్జాపై నిజనిర్ధారణ కమిటీ వేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని, ఈ కమిటీకి హరీశ్‌రావు నేతృత్వం వహించినా స్వాగతిస్తామని అన్నారు. చెరువు శిఖం భూముల్లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని, వ్యవసాయం చేసుకుంటే ఇబ్బంది లేదని తెలిపారు.

మనీశ్‌సిసోడియాకు 16 నెలల తర్వాత బెయిల్ రాగా, కేజ్రీవాల్ ఇంకా జైలులోనే ఉన్నారని, కవితకు మాత్రం 5 నెలల్లోనే ఎలా బెయిల్ వచ్చిందని ప్రశ్నించారు. తాము ఇచ్చిన హామీల అమలుపై ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు పెట్టి చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు.

తాగునీటి వివరాలివ్వండి

తెలంగాణ, ఏపీకి కేఆర్‌ఎంబీ లేఖ

హైదరాబాద్, ఆగస్టు 28 (నమస్తే తెలంగాణ):తెలంగాణ, ఏపీలో జిల్లాలు, మండలాలు, గ్రామాల వారీగా ఉన్న జనాభాతోపాటు ఏడాదిపాటు తాగునీటి కోసం ఎన్ని నీళ్లు అవసరమన్న వివరాలను ప్రాజెక్టులవారీగా అందజేయాలని కేఆర్‌ఎంబీ తెలుగు రాష్ట్రాలకు సూచించింది. తెలంగాణ, ఏపీకి బుధవారం ప్రత్యేకంగా లేఖ రాసింది. ఏపీ పునర్విభజన చట్టానికి అనుగుణంగా తాగు, సాగునీటి వివాదాల పరిష్కారానికి చర్యలు చేపట్టాల్సి ఉన్నదని తెలిపింది. 2024–25 కు సంబంధించి జూరాల, శ్రీశైలం, నాగార్జునసాగర్, ఎస్‌ఎస్ టెయిల్ పాండ్, పులిచింతల, ప్రకాశం బరాజ్‌ల కింద తాగునీటిని పొందుతున్న జనాభా వివరాలను అందజేయాలని కోరింది. సెప్టెంబర్ 15లోగా వివరాలను అందజేయాలని ఇరు రాష్ట్రాలకు స్పష్టం చేసింది.

జన్వాడలో రెండో రోజూ హైడ్రామా

- ఫాంహౌస్ ముందు ఫిరంగి నాలాను సర్వే చేసిన అధికారులు
- కూల్చేస్తారని జోరుగా ప్రచారం
- గుమిగూడిన ప్రజలు.. ఉత్కంఠ
- ఉన్నతాధికారులకు నివేదికిస్తాం
- డిప్యూటీ సర్వేయర్ రత్నకుమార్

జన్వాడ ఫాంహౌస్ వద్ద పోలీసుల బందోబస్తు

మణికొండ, ఆగస్టు 28 : నగర శివారు ప్రాంతంలోని శంకర్‌పల్లి మండలం జన్వాడ ఫాంహౌస్ ముందు ఉన్న చారిత్రక బుల్కాపూర్ ఫిరంగి నాలాపై నీటిపారుదల, రెవెన్యూ శాఖ అధికారులు బుధవారం సంయుక్తంగా సర్వే చేశారు. దాదాపు రెండు గంటలపాటు జన్వాడ గ్రామ రెవెన్యూ పరిధిలోని బుల్కాపూర్ నాలా సరిహద్దు వరకు డీజీపీఎస్ మిషన్ డిజిటల్ సర్వేను గ్రామ నక్ష ప్రకారం జిల్లా డిప్యూటీ సర్వేయర్ రత్నకుమార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ తేజ, సర్వేయర్ సాయికుమార్ నేతృత్వంలో చేపట్టారు. ప్రదీప్‌రెడ్డికి చెందిన పాంహౌస్ ప్రధాన గేటు ముందు సర్వే మిషన్‌తో కొలతలు తీసుకున్నారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం 18 నుంచి 20 మీటర్ల వెడల్పు ఉండాల్సిన నాలా అన్ని చోట్లా 4 నుంచి 6 మీటర్ల వరకే ఉన్నట్టు ప్రాథమికంగా గుర్తించినట్టు అధికారులు తెలిపారు. నాలా బఫర్‌జోన్ చాలా వరకు అంతటా ఆక్రమించినట్టు వెల్లడించారు. బుల్కాపూర్ నుంచి మొత్తంగా నాలా 21 కిలోమీటర్ల వరకు ఉంటుందని, నాలా సరిహద్దులను చుట్టుపక్కల ఉన్న సర్వే నంబర్లలోని పట్టా భూమి విస్తీర్ణంతో కలిసి పూర్తిగా కొలతలు నిర్ధారిస్తామని తెలిపారు. సర్వే నివేదికను ఉన్నతాధికారులకు అందజేసి వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

కూల్చివేస్తారంటూ ప్రచారం..

వారం నుంచీ ప్రదీప్‌రెడ్డికి చెందిన ఫాంహౌస్‌ను కూల్చివేస్తారని వస్తున్న వార్తల నేపథ్యంలో బుధవారం ఫాంహౌస్ సమీపంలో వందలాది మంది ప్రజలు గుమిగూడారు. ఏం జరుగుతుందోనన్న ఉత్కంఠతో సర్వే తీరును ఆసక్తిగా గమనించారు. నాలాను కబ్జా చేస్తున్నారని అనేకసార్లు ఫిర్యాదులు చేసినా స్పందించని అధికారులు హడావిడిగా వచ్చి సర్వే చేస్తుండటంపై అనుమానాలు వ్యక్తంచేశారు. ఉన్నతాధికారుల ఆదేశాలమేరకే సర్వేకు వచ్చామని, ఎలాంటి కూల్చివేతలు చేయడంలేదని అధికారులు చెప్పడంతో అక్కడి నుంచి వెళ్లిపోయారు. నాలా అంతటా ఆక్రమణకు గురైనట్టే ప్రదీప్‌రెడ్డి ఫాంహౌస్ ప్రధానగేటు ముందు ఉన్నదని, దీనికి అధికారులు ఎందుకు హడావుడి చేస్తున్నారో అర్థంకావడంలేదని స్థానికులు చర్చించుకోవడం కనిపించింది.

ఇదేం ద్వంద్వనీతి?

మొదటిపేజీ తరువాయి...

కూల్చివేతలు చేపట్టారు. ఆ తర్వాత ప్రభుత్వం గత నెల 19న హైడ్రా ఏర్పాటు, విధి విధానాలు, పరిధిని వివరిస్తూ జీవో 99ను జారీ చేసింది. ఆపై చేపట్టిన పలు కూల్చివేతల్లో భాగంగా ఈ నెల 18న ఔటర్ రింగు రోడ్డు పరిధి దాటి జీవోలో పొందుపరచని ప్రాంతాలకు కూడా హైడ్రా వెళ్లింది. చిలుకూరు, హిమాయత్‌నగర్, అప్పోజీగూడల్లో నిర్మాణాలను కూల్చివేశారు. అయితే, ప్రభుత్వానికి ఇచ్చిన నివేదికలో హిమాయత్‌నగర్, అప్పోజీగూడల్లోని కూల్చివేతల వివరాలను పొందుపరచకపోవటం గమనార్హం. ముఖ్యంగా అప్పోజీగూడలో గండిపేట ఎఫ్‌టీఎల్‌ల్లో ఉన్నాయంటూ కూల్చివేసిన మూడు నిర్మాణాలు.. వాటి పక్కనే ఉన్న వాటిని వదిలివేయటమే హైడ్రా అడుగులపై తీవ్ర సందేహాలకు తావిచ్చింది. అనుమానానికి తగ్గట్టే హైడ్రా తన నివేదికలో ఈ వివరాలను పేర్కొనలేదు. పైగా పరిధి దాటి చేపట్టిన కూల్చివేతలపై హైడ్రా ఇంత వరకు స్పష్టత ఇవ్వలేదు.

ఒవైసీకి అలా.. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలకు ఇలా..

హైడ్రా చివరగా ఈ నెల 24న ఎన్ కన్వెన్షన్‌ను కూల్చివేసింది. అనంతరం ఇతర శాఖలు నోటీసులు ఇవ్వటం మొదలుపెట్టాయి. ఇందులోభాగంగా ఘట్‌కేసర్ మండలం వెంకటాపురంలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డికి చెందిన విద్యాసంస్థలకు నీటిపారుదల శాఖ అధికారులు నోటీసులు జారీచేశారు. ఇదే క్రమంలో ఒవైసీ బ్రదర్స్‌కు చెందిన వైద్యకళాశాల సలకం చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో ఉన్నట్టు సామాజిక మాధ్యమాల్లో పెద్ద ఎత్తున వైరల్ కావటంతో మజ్లిస్ శాసనసభాపక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ సంచలన వ్యాఖ్యలు చేశారు. హైడ్రాను ఎదుర్కొనేందుకు 40 వేల మంది విద్యార్థులు ఉన్నారని హెచ్చరించారు. ఇదే సమయంలో ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ కూడా జీహెచ్‌ఎంసీని కూల్చివేస్తారా? అని ప్రశ్నించారు. దీంతో హైడ్రా స్వరం మారింది. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని విద్యాసంస్థలకు గడువు ఇస్తామని, అది ఒవైసీ అయినా, మల్లారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి అయినా ఒకటేనని స్పష్టంచేశారు. తాజాగా బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి మీడియా చిట్‌చాట్‌లోనూ ఒవైసీకి చెందిన నిర్మాణానికి గడువు ఇస్తామని చెప్పారు. కానీ బుధవారమే బీఆర్‌ఎస్‌కు చెందిన మరో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డికి సంబంధించిన ఎంఎల్‌ఆర్‌ఐటీ, ఐఏఆర్‌ఈ విద్యాసంస్థలకు రెవెన్యూ శాఖ నోటీసులు జారీ చేసింది. ఏడు రోజుల్లో ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో ఉన్న నిర్మాణాలను తొలగించాలని, లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. మరి.. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డికి చెందిన విద్యాసంస్థల్లోనూ వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఒవైసీ వైద్యకళాశాలలో విద్యార్థుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొన్న హైడ్రా.. ఇక్కడ మాత్రం ఆ అంశాన్ని విస్మరిస్తుందా?

జన్వాడ వైపు పడుతున్న అడుగులు

తాజాగా కూల్చివేతల అడుగులు జన్వాడ వైపు కొనసాగుతున్నాయి. గత రెండు రోజులుగా అక్కడ ఉన్న ఫాంహౌస్ ముందు బుల్కాపూర్ నాలాను సర్వేచేస్తున్న రెవెన్యూ, ఇరిగేషన్ శాఖ అధికారులు అసలు నాలా ఎంత వెడల్పు ఉన్నదనే వివరాలను చెప్పలేకపోతున్నారు. అది ఎంత విస్తీర్ణంలో ఉన్నా నిబంధనల ప్రకారం అక్కడ ఉన్న ప్రహరీగోడ, గేటు మాత్రమే బఫర్‌జోన్ పరిధిలోకి వస్తాయనే అంచనాకు అధికారులు వచ్చారు. దీంతో బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి మీడియా చిట్‌చాట్‌లో జీవో 111 కొనసాగుతుందని చెప్పారు. అంటే నాలా నిబంధనలు సర్కారు పెద్దల కలను సాకారం చేసే పరిస్థితి లేకపోవడంతో 111 జీవోను తెరపైకి తెస్తున్నారు. ఇదే అమలైతే జన్వాడ ఫాంహౌస్ మాత్రమే దాని పరిధిలోకి వస్తుందా? 111 జీవో పరిధిలో పుట్టగొడుగుల్లా వెలిసిన విద్యాసంస్థల భవనాలు, ఇతర నిర్మాణాలకూ ఇదే సూత్రం వర్తిస్తుందా? అన్న ప్రశ్నలు ఎదురవుతున్నాయి. సామాన్యులు కూడా సర్పంచుల అనుమతులతో వేల నిర్మాణాలు చేపట్టినందున.. 111 జీవో పరిధిలోని గ్రామాల్లో శిథిలాలు తప్ప ఇంకేం కనిపిస్తాయి? అని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పైగా సీఎం రేవంత్‌రెడ్డి 111 జీవో అమలులో ఉంటుందని సెలవిస్తుండగా.. ఇటీవల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాత్రం 111 జీవో పరిధిలో ఒక్క నిర్మాణాన్నీ కూల్చనివ్వబోమని స్పష్టం చేశారు. సీఎం ఒకలా, మంత్రి ఇంకోలా మాట్లాడటంపై సామాన్యుల్లో సందేహాలు కలుగుతున్నాయి. కేంద్ర మాజీ మంత్రి పల్లంరాజు నిర్మాణాన్ని కూల్చామని మంత్రులు, సాక్షాత్తు సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించినా.. ఇంకా పల్లం రాజు నిర్మాణం ఇంకా పదిలంగా ఎందుకు ఉన్నది? అనేదానికి ప్రభుత్వ పెద్దలు సమాధానం చెప్పటం లేదు.

కృష్ణాకు మళ్లీ మొదలైన వరద



గద్వాల/శ్రీశైలం/నందికొండ, ఆగస్టు 28 : కృష్ణా, తుంగభద్ర నదులకు మళ్లీ వరద మొదలైంది. బుధవారం జూరాలకు 2.44 లక్షల క్యూసెక్కులు రాగా.. 45 గేట్లు ఎత్తి దిగువకు 2,86,740 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం ప్రాజెక్టుకు 2,14,334 క్యూసెక్కుల ఇన్‌ఫ్లోగా వస్తుండగా నాలుగు గేట్లు తెరిచి 1,12,300 దిగువకు వదులుతున్నారు. కాగా నాగార్జునసాగర్ రిజర్వాయర్‌కు వరద ఉధృతి కొనసాగుతుండడంతో డ్యామ్ 18 క్రస్ట్ గేట్ల ద్వారా నీటిని విడుదల చేస్తున్నారు. బుధవారం సాగర్‌కు 1,94,758 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా క్రస్ట్ గేట్ల ద్వారా 1,45,800 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. నాగార్జునసాగర్ జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు (312.50 టీఎంసీలు) కాగా ప్రస్తుతం పూర్తి స్థాయిలో నిండింది.

తెలంగాణకు 31 కొత్త ఎఫ్‌ఎం స్టేషన్లు

హైదరాబాద్, ఆగస్టు 28 (నమస్తే తెలంగాణ): ప్రైవేట్ ఎఫ్‌ఎం స్టేషన్ల మూడో దశలో భాగంగా తెలంగాణలో 31 స్టేషన్లు ఏర్పాటు కానున్నట్టు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. ఆదిలాబాద్, కొత్తగూడెం, కరీంనగర్, ఖమ్మం, మహబూబ్‌నగర్, మంచిర్యాల, నల్గొండ, రామగుండం, సూర్యాపేట జిల్లాలకు మూడు చొప్పున రేడియో చానల్స్, నిజామాబాద్ జిల్లాకు 4 చానల్స్ కేటాయించారని పేర్కొన్నారు.

కూల్చివేతలు నిబంధనలకు లోబడి ఉండాలి

మొదటిపేజీ తరువాయి...

మల్కాజిగిరి జిల్లా గండిమైసమ్మ మండలం)లోని 480–483 సర్వే నంబర్లలో మారుతి ఎడ్యుకేషనల్ సొసైటీకి చెందిన 10 ఎకరాలు, మర్రి ఎడ్యుకేషనల్ సొసైటీకి చెందిన 17.20 ఎకరాల్లో ఆక్రమణలున్నాయంటూ ఈ నెల 22న గండిమైసమ్మ ఎమ్మార్వో ఇచ్చిన నోటీసులను సవాలు చేస్తూ ఆ రెండు విద్యా సంస్థలు దాఖలు చేసిన పిటిషన్లపై జస్టిస్ కే లక్ష్మణ్ బుధవారం విచారణ జరిపారు. చిన్నదామెర చెరువులో 8.25 ఎకరాలు ఆక్రమణకు గురయ్యాయంటూ తాసిల్దార్ ఇచ్చిన నోటీసును రద్దు చేయాలని పిటిషనర్ల తరపున సీనియర్ న్యాయవాది ఎస్ నిరంజన్‌రెడ్డి కోరారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లను నిర్ధారించకుండా తాసిల్దార్ ఏకపక్షంగా నోటీసు ఇచ్చారని పేర్కొంటూ.. చట్టప్రకారం సర్వే నిర్వహించి సరిహద్దులు నిర్ణయించేలా తాసిల్దార్‌కు ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం మర్రి విద్యాసంస్థల్లో దాదాపు 5 వేల మంది విద్యార్థులు ఉన్నారని, కూల్చివేత చేపడితే వారంతా ఇబ్బందులకు గురౌతారని చెప్పారు. ఆ విద్యా సంస్థల నిర్మాణాలకు 2007లోనే సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, పంచాయతీ ఈవోల నుంచి అనుమతులు పొందారని, ఇప్పుడు వాటిని అక్రమణలని ఏకపక్షంగా చెప్పడం అన్యాయమని పేర్కొన్నారు. దీనిపై ప్రభుత్వం తరపున అడ్వకేట్ జనరల్ తేరా రజనీకాంత్‌రెడ్డి ప్రతివాదన చేస్తూ.. చిన్నదామెర చెరువులోకి ఆక్రమణదారులు మురుగునీటిని వదులుతున్నారని, అక్కడ ఆక్రమణలు ఉన్నాయని అడ్వకేట్ కమిషన్ నివేదించడంతో ఆ ఆక్రమణలను తొలగించాలని గతంలో ద్విసభ్య ధర్మాసనం ఆదేశించిందని గుర్తుచేశారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలోని ఆక్రమణలను కూల్చివేయాలని గతంలో సుప్రీంకోర్టు కూడా ఉత్తర్వులు జారీ చేసిందని హైడ్రా తరపు న్యాయవాది కటిక రవీందర్‌రెడ్డి చెప్పారు. ఈ వాదనల అనంతరం జస్టిస్ కే లక్ష్మణ్ స్పందిస్తూ.. హైకోర్టుతోపాటు జిల్లా కలెక్టర్ ఆదేశాలకు అనుగుణంగా తాసిల్దార్ 7 రోజుల గడువుతో కూల్చివేత నోటీసులు ఇవ్వడం, ఇప్పుడు కూల్చివేతలకు హైడ్రా రంగంలోకి దిగడంతో ఆ విద్యాసంస్థలు ఆందోళన చెందుతున్నాయని చెప్పారు. ఈ నేపథ్యంలో తాసిల్దార్ ఇచ్చిన నోటీసులను రద్దు చేసి, వాటిని షోకాజ్ నోటీసులుగా మారుస్తున్నామని తెలిపారు. పిటిషనర్లు చూపిన ఆధారాలను పరిశీలించాక చట్టప్రకారం హైడ్రా ముందుకువెళ్లాలని స్పష్టం చేస్తూ.. మర్రి, మారుతీ విద్యాసంస్థల పిటిషన్లపై విచారణ ముగిసినట్టు ప్రకటించారు

అప్పటివరకు కూల్చివేతలు చేపట్టొద్దు

ఎమ్మెల్యే పల్లా విద్యా సంస్థల కేసులో హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, ఆగస్టు 28 (నమస్తే తెలంగాణ): మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కొర్రాముల (వెంకటాపూర్)లోని నాదం చెరువుకు సంబంధించిన రికార్డులను సమర్పించాలని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఆ చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మాణాలు ఉన్నాయంటూ అధికారులు అత్యుత్సాహం చూపుతున్నారని పేర్కొంటూ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డికి చెందిన అనురాగ్ యూనివర్సిటీ, గాయత్రి ఎడ్యుకేషనల్ సొసైటీ, నీలిమా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ మరోసారి హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్లపై జస్టిస్ టీ వినోద్‌కుమార్ బుధవారం విచారణ జరిపారు. పిటిషనర్లు అన్ని అనుమతులు తీసుకుని 17.21 ఎకరాల్లో విద్యాసంస్థలను నిర్మించినట్టు వారి తరపు సీనియర్ న్యాయవాది ఎస్ నిరంజన్‌రెడ్డి తెలిపారు. కూల్చివేత చర్యలు చట్టానికి లోబడి ఉండాలని స్పష్టం చేస్తూ ఇటీవల హైకోర్టు వెలువరించిన ఉత్తర్వులకు విరుద్ధంగా అధికారుల చర్యలు ఉన్నాయని, విద్యార్థులకు ఇబ్బందుల్లేకుండా సెలవుల్లోనే కూల్చివేతలు చేపడతామని చెప్పిన హైడ్రా అందుకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నదని వివరించారు. అనంతరం తదుపరి విచారణను ఈ నెల 30కి వాయిదా వేస్తున్నట్టు ప్రకటించిన జస్టిస్ వినోద్‌కుమార్.. అప్పటివరకు పిటిషనర్ల నిర్మాణాలను కూల్చరాదని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు.